

స్టూడెంట్స్‌ను ఇన్‌స్పైర్ చేయండి

జిల్లావ్యాప్తంగా త్వరలో జరగనున్న ఇన్‌స్పైర్ మనక్‌కు పిల్లలను ఇన్‌స్పైర్ చేయాలని డీఈఓ మర్రెడ్డి అనురాధ సూచించారు. మంగళవారం పోస్టర్లను విడుదల చేశారు. -8లో



వైఎస్సార్‌సీపీ నేత ఇంట్లో అర్ధరాత్రి పోలీసుల సోదాలు

కమలాపురం నియోజకర్గ వైఎస్‌ఆర్‌సీపీ నేత సాయినాథ శర్మపై పోలీసులు వేధింపులకు పాల్పడుతున్నారు. -8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 37.8/25.6

జిల్లాలో మంగళవారం 25.6 - 37.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

'స్మార్ట్ మీటర్ల'తో ఉపయోగం



స్మార్ట్ మీటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా విద్యుత్ అధికారి రమణ

రైల్వేకోడూరు అర్బన్: విద్యుత్‌శాఖ వారు బిగిస్తున్న స్మార్ట్ మీటర్ల ద్వారా వినియోగదారులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని మంగళవారం ఉమ్మడి కడప జిల్లా విద్యుత్ అధికారి ఎస్ రమణ తెలిపారు. స్థానిక అటవీశాఖ అతిథి గృహంలో అమర్చిన స్మార్ట్ విద్యుత్ మీటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ మీటర్ల వల్ల వినియోగదారుడు తన ఆండ్రాయిడ్ ఫోన్‌లో ఎంత విద్యుత్ ఎన్ని యూనిట్లు వాడామని తెలుసుకోవచ్చని తెలిపారు. దాని ద్వారా విద్యుత్ ఆదా అవుతుందని తెలిపారు.విద్యుత్ బిల్లు తగించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 23న ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో విద్యుత్ ఏర్పాట్లపై తగిన సూచనలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో డివిజన్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి, డీ భాస్కర్ రావు, ఏఈ యోగానంద్ పాల్గొన్నారు.

దోమల నిర్మూలనతో వ్యాధులకు అడ్డుకట్ట



ప్రతిజ్ఞ చేస్తున్న డీఎంహెచ్‌ఓ సిబ్బంది


కడప రూరల్: దోమలను నిర్మూలించి, వాటి ద్వారా వచ్చే వ్యాధులకు అడ్డుకట్ట వేద్దామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఆ శాఖ జిల్లా కార్యాలయంలో ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ దోమలు పుట్టకుండా..కుట్ట కుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజల్లో దోమల నిర్మూలనకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా దోమల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ శశిభూషణ్, ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ డాక్టర్ రమేష్, డాక్టర్ వెంకటచంద్రారెడ్డి, మనోమమ, ఖాజామొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

23న ఇంటర్వ్యూ



రాయచోటి (జగదాంబసెంటర్): రాయచోటిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ విభాగంలో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేందుకు ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులకు ఈ నెల 23వ తేదీన ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.ఎస్. హైదరాలీ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. నెట్, స్లెట్, పీహెచ్‌డీ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఇస్తామని వివరించారు. ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలన్నారు.

గండికోటకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



గండికోటజలాశయం లోకి 10.5 టీఎంసీలు చేరిన కృష్ణాజలాలు

కొండాపురం: గండికోట జలాశయానికి మూడు రోజుల నుంచి ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉందని జల వనరులశాఖ డీఈ ఉమమాహేశ్వర్లు మంగ్లవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలం జలాశయంలో పూర్తిగా నీటిసామర్థ్యం ఉండటంతో అక్కడ నుంచి ఆవుకు రిజర్వాయర్ నుంచి గాలేరినగరి సృజల స్రవంతి ప్రధాన కాలువ ద్వారా గండికోట టర్నల్ లో నుంచి 11 వేల క్యూసెక్కుల కృష్ణజలాలు ఇన్‌ఫ్లో వస్తున్నాయన్నారు. అలాగే అనంతపురం జిల్లాలో ఎగువ ప్రాంతాలల్లో కురిసిన వరద నీటి ఉధృతికి ఇక్కడి వంకలువాగులు జోరుగా ప్రవహిస్తున్నాయి. ఈ క్రమంలో పెన్నా ద్వారా 2 వేల క్యూసెక్కుల వరదనీరు గండికోటకు చేరుతోందన్నారు. కాగా గండికోట జలాశయం పూర్తి సామర్థ్యం 26. 85 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 10.5 టీఎంసీలకు చేరినట్లు ఆయన తెలిపారు. గండికోట జలాశయం నుంచి శెట్టి వారి పల్లె వద్ద మొయిన్ హెడ్ రెగ్యూలేటర్ నుంచి జీఎన్ ఎస్ఎస్ కాలవ ద్వారా 500 క్యూసెక్కులనీరు సర్వరాయసాగర్ కు తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆయాల ఆకలి కేకలు

- ప్రభుత్వ బడుల్లో ఆయాలు, వాచ్‌మెన్‌లకు అందని జీతాలు
- కుటుంబం గడవక అవస్థలు
- పట్టించుకోని పాలకులు, విద్యాశాఖ అధికారులు




కడపలోని భగత్‌సింగ్‌నగర్ ప్రాథమిక పాఠశాల ముఖద్వారం

కడప ఎడ్యుకేషన్: ఒకటి రెండు కాదు నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఆయాలు అల్లాడుతున్నారు. పూట గడవక అవస్థలు పడుతున్నారు. పొట్టకూటి కోసం పాఠశాలల్లో పారిశుధ్య పనులకు చేరిన చిరుద్యోగులపై కూటమి ప్రభుత్వం చుక్క లు చూపిస్తోంది. వారు చేసే కష్టాన్ని ఏ మాత్రం గుర్తించకుండా నిర్లక్ష్యం చేస్తోంది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, నైట్‌వాచ్ మెన్‌లకు ఈఏడాది ఏప్రిల్ నుంచి జీతాలు పెండింగ్‌లో పెట్టారు. దీంతో వారి కుటుంబాలు దయనీయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. జిల్లాలో ప్రభుత్వ బడుల్లో విధులు నిర్వహిస్తున్న ఆయా, నైట్ వాచ్ మెన్‌ల ఆకలి కేకలు ప్రభుత్వానికి వినపడటం లేదా అని చిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'అప్పులు చేసి కుటుంబ పోషణ

నెలవారీగా ఆయాలకు, నైట్ వాచ్‌మెన్‌లకు జీతాలు ఇవ్వకపోవడంతో అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. రూ. 5 వేల నుంచి రూ.10 వేల వరకు వడ్డీలకు అప్పులు తీసుకుని కుటుంబాలకు పోషించుకుంటున్నారు. జీతాలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే ఎలా బతకాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఆయాలకు, నైట్‌వాచ్‌మెన్‌లకు రూ.6 వేలు నెలకు ప్రభుత్వం జీతం మంజూరు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు ఒకొక్కరికి రూ. 24 వేలు జీతం పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడిస్తున్నారు.



పాఠశాలలో శుభ్రం చేస్తున్న ఆయా

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు: **2849**

పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలు: **2019**

నైట్‌వాచ్‌మెన్‌లు: **220** మంది

జీతాలు అందని నెలలు: **ఏప్రిల్, మే, జూన్, జులై**

పట్టించుకోని ఉన్నతాధికారులు

జీతాల పెండింగ్ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పుడు ఎవరూ పట్టించుకోవడం లేదని చిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని పెండింగ్‌లో ఉన్న జీతాలను మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

కుటుంబ జీవనం దుర్భరం



జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌లకు నాలుగు నెలలుగా జీతాలు అందలేదు. దీంతో వారి కుటుంబ జీవనం దుర్భరంగా మారింది.వారికి వచ్చేది, ఇచ్చేది అరకొర జీతాలే. వాటిని కూడా సకాలంలో సక్రమంగా ఇవ్వకపోతే కుటుంబ పోషణ ఎలా చేసుకుంటారు. వారు జీతాల విషయమై ప్రధానోపాధ్యాయులతోపాటు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. తక్షణమే చంద్రబాబు ప్రభుత్వం స్పందించి వారికి వేతనాలు అందించే చర్యలు తీసుకోవాలి. – కేసీ బాదుల్లా, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ, కడప

బొజ్జ గణపయ్యా... పొట్ట నింపవయ్యా!

వారు దుమ్ము, ధూళి చూడలేదు.. మండుతున్న ఎండను సైతం లెక్కచేయలేదు... పగలు, రేయి కష్టపడుతూనే ఉన్నారు.. పసిబిడ్డలను చంకనేసుకుని.. కాళే కడుపును చేతబట్టుకుని వందలాది కిలోమీటర్ల దూరం నుంచి ఇక్కడికి వచ్చారు. నాలుగు డబ్బులు కళ్లజూడొచ్చనే ఆశతో ఊరుగాని ఊరొచ్చారు.. కానీ వీరి కష్టానికి, ఆశలకు మధ్యన పెట్టుబడిదారులు చేరి ఫలితం దక్కకుండా చూస్తున్నారు. వినాయకుడి విగ్రహాల తయారీదారుల కష్టం కార్మికుడి పాలవుతోంది.

- కార్మికుడి కష్టం కాంట్రాక్టర్ పాలు
- ప్రారంభమైన వినాయక విగ్రహాల వ్యాపారం

కడప కల్చరల్: మరో మూడు వారాల్లో శ్రావణ మాసం ముగిసి భాద్రపదం వస్తుంది. సందుగొందుల్లో సైతం గణపయ్య విగ్రహాలు వెలుస్తాయి. వినాయక చవితి సందళ్ల పందిళ్ల ఏర్పాటుతో ప్రారంభమవుతాయి. ఏటా నెలరోజుల ముందే ఊరిబయట విగ్రహాల తయారీ మొదలవుతుంది. రాజస్థాన్, గుజరాత్ తదితర ప్రాంతాల నుంచి విగ్రహాల తయారీదారులు ఈ ప్రాంతానికి వచ్చి అక్కడి నుంచి తెచ్చుకున్న సామగ్రితోపాటు స్థానికంగా లభించే సామగ్రితో విగ్రహాలు తయారు చేస్తారు. ఊరి బయట పెద్ద టెంట్లు వేసుకుని మహిళలు, పసిపిల్లలు కూడా వాటిలోనే గడుపుతారు. ఒకటి, రెండు నెలలపాటు తయారు చేసిన విగ్రహాలను అమ్ముకుని సంతృప్తిగా తిరిగి తమ ప్రాంతానికి వెళతారు. ఇదంతా మామూలే. కానీ ఈ సంవత్సరం పరిస్థితి కొద్దిగా మారింది. స్థానికంగా ఉండే పెట్టుబడిదారులు ముందే ముడి విగ్రహాలను తెచ్చిపెట్టుకుని రాజస్తానీ కళాకారులకు కాంట్రాక్టుపై రంగులు పూసే పని అప్పగించారు. సదరు పెట్టుబడి పెట్టిన స్థానికులే విగ్రహాలకు అడ్వాన్సులు తీసుకుని ప్రజలు కోరిన తేదికి విగ్రహాలను సిద్ధం చేయాలని కళాకారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఆలస్యమైతే కూలీ తగ్గుతుందన్న భయంతో కళాకారులు రేయింబవళ్లు కష్టపడుతున్నారు. కడప నగరంతోపాటు ఇతర పట్టణాలు, మండల కేంద్రాల శివార్లలో పెద్ద టెంట్లు వేసుకుని గణపయ్య విగ్రహాలను తయారు చేస్తున్నారు. ముడి విగ్రహాలకు చేతులు, తొండం తగిలించి రంగులు పూసే పనిలో నిమగ్నమై ఉన్నారు. హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై తదితరప్రాంతాల నుంచి ఈ పనిపై జిల్లాకు 400–500 మంది వరకు వచ్చి కూలీ పనులు చేసుకుంటున్నారు. నిజానికి విగ్రహాల వ్యాపారం నిన్న, మొన్నటివరకు కళాకారుల ద్వారానే జరిగేది. ప్రస్తుతం పెట్టుబడి దారులు రంగప్రవేశం చేశాక కళాకారులంతా కూలీలుగా మారారు. తయారీదారుల ప్రమేయం లేకుండా కాంట్రాక్టర్లే విగ్రహాలకు ధరలు నిర్ణయించి అమ్ముతున్నారు. ఐదు అడుగుల విగ్రహం రూ. 8–10 వేలకు విక్రయిస్తున్నారు. 13 అడుగుల భారీ విగ్రహం రూ. 50–60 వేలకు ఇస్తున్నారు. తాము మాత్రం ఇష్టమొచ్చిన ధరకు అమ్ముకుంటూ కళాకారులకు కూలీ మాత్రమే ఇస్తున్నారు. సీజన్ పోతే ఈ ఆదాయం కూడా ఉండదంటూ కళాకారులు వచ్చిన కాడికే తీసుకుంటున్నారు. అసలే దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. 'కాంట్రాక్టర్లకు మంచి మనసు ఇవ్వయ్యా..' అంటూ బొజ్జ గణపయ్యనే వేడుకుంటున్నారు.



విగ్రహానికి రంగులు వేస్తున్న కళాకారుడు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

కలెక్టర్ శివశంకర్

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో కొత్తగా పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకొచ్చే ఔత్సాహికులకు తగిన ప్రోత్సాహం అందించడంతోపాటు ప్రభుత్వం అన్ని రకాల రాయితీలను అందిస్తుందని కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్ఠం చేసి మరింత విస్తృత పరిచేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహకాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. అదే దిశగా జిల్లాలో కూడా పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్ఠం చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన ఇండస్ట్రియల్ పాలసీకి అనుగుణంగా జిల్లా ఆర్థిక అభివృద్ధికి దోహద పడేలా జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వనున్నట్లు తెలిపారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోకి రావాలనుకునే వారికి ఆర్థిక ప్రోత్సాహాన్ని బ్యాంకుల ద్వారా అందిస్తామన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు తోడ్పాటు అందిస్తామని వివరించారు. ఏవైనా దరఖాస్తులు పెండింగ్ లో ఉంటే వెంటనే పరిశీలించి పూర్తి చేసేలా చర్యలు చేపడతామన్నారు. జిల్లా స్థాయి నుంచి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యువతకు పారిశ్రామిక పెట్టుబడులు, యూనిట్ల స్థాపనపై విస్తృతంగా అవగాహన పెంపొందిస్తున్నామన్నారు. పారిశ్రామిక అభివృద్ధి పాలసీ 2024–29, ఎంఎస్ఎంఈ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ 2024–29, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 2024–29 ప్రకారం జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పాటునిస్తామన్నారు. అనంతరం డీఐఈపీసీ కమిటీ సభ్యులు, కో ఆర్డినేటర్లు, ఇండస్ట్రీయల్ నిర్వాహకుల నుంచి వివిధ సెక్టార్లవారీగా సంబంధిత అంశాలపై కలెక్టర్ అభిప్రాయాలను సేకరించి, వారికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తోపాటు పరిశ్రమలశాఖ జీఎం జయలక్ష్మి, ఎల్డీఎం జనార్దన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇసుక దోపిడీపై ఫిర్యాదుల వెల్లువ

- అక్రమ తరలింపు దారులపై ఉదాసీనత వద్దు
- జెడ్పీ చైర్ పర్సన్ శారద



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ శారద



సమావేశంలో పాల్గొన్న అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ఇసుక, రాళ్ల, మట్టి వంటి సహజ వనరులను ఇష్టానుసారంగా తవ్వేసి అక్రమంగా తరలిస్తున్నారంటూ ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ విషయంలో మైనింగ్ అధికారులు ఉదాసీనత వీడాలని జెడ్పీ చైర్ పర్సన్ శారద అన్నారు. అక్రమాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన స్థాయీ సంఘాల సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీలు ముత్యాల ప్రసాద్, రవికుమార్‌రెడ్డి, సుమిత్ర తదితరులు అక్రమ రవాణా అంశాన్ని లేవనెత్తారు. ఇందుకు జెడ్పీ చైర్ పర్సన్ స్పందిస్తూ మైన్స్ అధికారులతోపాటు రెవెన్యూ, పోలీసులు కూడా ఈ అంశంపై స్పందించాలన్నారు. 2020లో నిర్మించిన అంగన్వాడీ కేంద్రాలకు బిల్లులు ఇవ్వాలని పోరుమామిళ్ల జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ కోరారు. అనుమతులు లేకున్నా ప్రైవేటు వ్యక్తులు కొంతమంది ఆర్వో వాటర్ అంటూ అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలిపారు. అయినా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని వాపోయారు. ఇందుకు జెడ్పీ చైర్ పర్సన్ స్పందిస్తూ జిల్లాలో అనుమతులు లేని ఆర్వో ప్లాంట్లను గుర్తించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్‌శాఖ నుంచి గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జెడ్పీకి రావాల్సిన నిధులను విడుదల చేయించాలని కోరారు. ఈనెల 23వ తేది జరిగే గ్రామసభల్లో సర్పంచులు, జెడ్పీటీసీలకు ప్రొటోకాల్ ప్రకారం ప్రాధాన్యత ఇవ్వాలని కమలాపురం జెడ్పీటీసీ సుమిత్ర కోరారు. కో ఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో జంగిల్ క్లియరెన్స్‌లకు అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈనెల 23న జరిగే గ్రామసభలకు జెడ్పీటీసీలు హాజరై తమ ప్రాధాన్యత పనులను తెలియజేయాలని జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి సూచించారు. డీపీఆర్‌సీ భవనంలో జరిగిన వ్యవసాయ స్థాయీ సంఘ సమావేశాన్ని జెడ్పీ వైస్‌చైర్మన్ కిట్టు బాలయ్య నిర్వహించారు. ఈ సమావేశాల్లో పలువురు జెడ్పీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రిమ్స్ కళాశాలలో భద్రత కల్పిస్తాం

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా కేంద్రమైన కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్), మెడికల్ కళాశాల (రిమ్స్), డెంటల్ కళాశాల పరిసరాల్లో పూర్తిస్థాయి భద్రత కల్పిస్తామని కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో రిమ్స్, జీజీహెచ్ , డెంటల్ కళాశాలలో సమస్యలపై సంబంధిత కళాశాలల యాజమాన్యాలు, వైద్య విద్యార్థులు, వివిధ వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలలు, హాస్టళ్లు, జీజీహెచ్ హాస్పిటల్‌లోని వివిధ విభాగాల వార్డుల్లో, మౌలిక సదుపాయాలు, సమస్యలు, భద్రత అంశాలపై వైద్యవిద్యార్థులు విన్నవించిన విషయాలను జిల్లా కలెక్టర్ ఆలకించారు. అనంతరం వాటిపై స్పందిస్తూ అక్కడి సదుపాయాలను పరిశీలించాలని ఏపీఎంఎస్ఐడీసీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ వై.ఓ. నందన్, డీ ఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, డీసీహెచ్ఎస్ డా.హిమదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్వర్ రెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ బాలంజనేయులు, ఐఎంఏ మెంబర్లు, రిమ్స్, డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్స్, ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశ్నించేతత్వం ముఖ్యం


- శాస్త్రీయత లేని ఫలితాలను నమ్మవద్దు
- నేషనల్ సైంటిఫిక్ టెంపర్ డేలో వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి

వైవీయూ: శాస్త్రీయత లేని ఫలితాలను నమ్మవద్దని, ప్రతి విద్యార్థి ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం, జనవిజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో 'నేషనల్ సైంటిఫిక్ టెంపర్ డే' ను విశ్వవిద్యాలయంలోని సెనేట్ హాల్లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ విజ్ఞాన సాంకేతికతతో దేశం పురోగమిస్తుంటే మరోవైపు మూఢనమ్మకాలు విశ్వసిస్తుండడం బాధాకరమన్నారు. ఆర్థిక స్వావలంబనతో శాస్త్రీయత సాధ్యమని అభిప్రాయం వ్యక్తం చేశారు. సభకు అధ్యక్షత వహించిన రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ బాల్యదశ నుంచే పిల్లల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ సైన్సు మార్పును కోరుతుందని, ప్రగతిని ఆమోదిస్తుందన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ విశ్రాంత మేనేజర్ జి. గోపాల్ , ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త, డా. ఎన్. వెంకటరామిరెడ్డి తదితరులు ప్రసంగించారు. జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు సునీత, సరస్వతి, బాలబయన్న, వెంకటేశ్వర్లు, శివరాం, కిరణ్, గంగాధర్ రెడ్డి, కామేశ్వరమ్మ, శివరాం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరసనల హోరు





కడప రిమ్స్‌లో రెండవరోజున రిలే నిరాహార దీక్షలు చేస్తున్న జూనియర్ డాక్టర్స్, వైద్య విద్యార్థులు, కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల నిరసన ర్యాలీ

కోల్‌కతాలో ఆర్‌జీవికార్ మెడికల్ కళాశాల పీజీ విద్యార్థినిపై అత్యాచారం, హత్య సంఘటన దోషుల్ని ఉరి తీయాలని జనం ముక్తకంఠంతో నినదిస్తున్నారు. ర్యాలీలతో.. రిలే నిరాహార దీక్షలతో నిరసన తెలుపుతున్నారు. కడప రిమ్స్‌లో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండవరోజుకు చేరుకున్నాయి. నిందితులపై చర్యలను తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే కడపలోని మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు నగరంలో ర్యాలీ చేశారు. – నెట్‌వర్క్

క్లుప్తంగా

కడపలో మహిళా హాస్టళ్లలో పోలీసుల పరిశీలన



మహిళా హాస్టళ్లలో సమస్యలను తెలుసుకుంటున్న మహిళా పోలీసులు

కడప అర్బన్ : జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కడప నగరంలో ఉన్న 13 కళాశాలల విద్యార్థినుల ప్రైవేట్ వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను మహిళా పోలీసులు సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళా ఎస్ఐలు జ్యోతి, లక్ష్మీ, శాంతమ్మ, హైమావతి, నస్రీన్, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

కడప అర్బన్ : కడప నగరం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అల్మాస్‌పేటకు చెందిన బాలిక అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు అల్మాస్‌పేటకు చెందిన బాలిక సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి మరలా ఇంటికి రాలేదు. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని యానాది కాలనీకి చెందిన బుదనంపల్లె గౌరీ (21) అనే వివాహిత విష ద్రావణం తాగి ఆత్మహత్య చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. సంజీవనగర్‌కు చెందిన వెంకటేష్‌కు ముగ్గురు సంతానం. వారిలో పెద్ద కుమార్తె గౌరీకి ఐదేళ్ల క్రితం ఆంజనేయులు అనే వ్యక్తితో వివాహమైంది. వారికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. ప్రస్తుతం రిలయన్స్ పెట్రోల్ బంకు సమీపంలోని యానాది కాలనీలో వారు నివాసం ఉంటున్నారు. అతను కొన్ని రోజుల నుంచి భార్య గౌరీని వేధిస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలోనే ఈ నెల 18న ఆమె చలనం లేకుండా ఇంట్లో పడి ఉందని తెలియడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన అక్కడికి వెళ్లారు. విషద్రావణం తాగినట్లు కుమార్తె చెప్పడంతో వెంటనే ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి కడప రిమ్స్‌కు తరలించగా ఆరోగ్యం క్షీణించడంతో ఆమె సోమవారం మృతి చెందింది. తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాలమద్దిలేటి తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో వయ్యారిభామ నిర్మూలన



వయ్యారిభామ గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కడప అగ్రికల్చర్ : యాజమాన్య పద్ధతులతోనే వయ్యారిభామను సమూలంగా నిర్మూలించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. వయ్యారిభామ నివారణ వారోత్సవాల సందర్భంగా ఊటుకూరు కేవీకే ఆధ్వర్యంలో ఆగస్టు 16 నుంచి 22వ తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరయ్య వయ్యారిభామ కలుగు చేసే నష్టాలను, యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు.

వైఎస్సార్‌సీపీ నేత సాయినాథ శర్మ ఇంటిలో

అర్ధరాత్రి పోలీసుల సోదాలు

కమలాపురం : కమలాపురం నియోజకర్గ వైఎస్ఆర్‌సీపీ నేత సాయినాథ శర్మపై పోలీసులు వేధింపులకు పాల్పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాయినాథ శర్మతో పాటు ఆయన కుమారుడు, అనుచరులపై హత్యాయత్నం, కిడ్నాప్ తదితర కేసులను పాత తేదీలతో నమోదు చేసిన పోలీసులు సోమవారం రాత్రి 11.30 గంటల సమయంలో ఆయన ఇంటిని సోదా చేశారు. స్థానిక ఎస్ఐ ప్రతాప్ రెడ్డి ఇద్దరు పోలీసులతో కలిసి ఎలాంటి సెర్చ్ వారెంట్ లేకుండా కమలాపురం పట్టణంలోని సాయనాథ శర్మ ఇంటిలో సోదాలు జరిపారు. ఆ సమయంలో ఇంటిలో ఆయన సతీమణితో బాటు, ఆయన చెల్లెలు, కూతురు, మరో పెద్ద వయసు ఉన్న మహిళ మాత్రమే ఉన్నారు. కాగా మంగళవారం ఉదయం వారిని నిర్బంధిస్తూ వారి ఇంటి వద్ద మహిళా పోలీసును కాపలాగా ఉంచారు.



సాయినాథ శర్మ ఇంటి వద్ద కాపలాగా ఉన్న మహిళా పోలీసు

కుటుంబ సభ్యులను నిర్బంధించారు

సోమవారం రాత్రి 11.30 గంటల సమయంలో పోలీసులు తమ ఇంటి ముందు కారు దిగి వేగంగా పరుగెత్తుకుంటూ ఇంట్లోకి ప్రవేశించారని సాయినాథ శర్మ కుటుంబ సభ్యులు తెలిపారు. తాము ఇంటి వరండాలో కూర్చుని మాట్లాడుకుంటుండగా తమ అనుమతి లేకుండా ఇంటిలో ప్రవేశించారని, ఇంట్లో సాయినాథ శర్మ గానీ , ఆయన కుమారుడు గానీ లేక పోవడంతో పోలీసులు వెనుదిరిగి వెళ్లారని తెలిపారు. మంగళవారం ఉదయం 6 గంటలకు మహిళా పోలీసును తమ ఇంటి వద్ద కాపలా పెట్టారని, తమ కుటుంబ సభ్యులు ఎవరూ బయటకు వెళ్లకూడదని ఆంక్షలు విధించారన్నారు. సాయినాథ శర్మ సొంత బావ సాంవత్సరీకాలు జరుగుతున్నా తమను అక్కడికి వెళ్లకుండా అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాయినాథ శర్మ కుటుంబ సభ్యులు ఎక్కడికి వెళ్లాలన్నా తమ అనుమతి తీసుకోవాలని ఎస్ఐ సూచించినట్లు మహిళా పోలీసు తెలిపారన్నారు. తాము ఏమి తప్పు చేశామని పోలీసులు తమ కుటుంబాన్ని ఇంతగా వేధిస్తున్నారని వారు ప్రశ్నించారు. తమ మీద పెట్టిన కేసులే తప్పుడు కేసులని, ఆ కేసుల్లో ఇంత వేధింపులు ఎందుకని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

పోలీసుల వేధింపులు తగదు

మాజీ ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, రెడ్యం వెంకట సుబ్బారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపక్ష పార్టీ నాయకులపై పోలీసుల వేధింపులు అధికమయ్యాయని కమలాపురం మాజీ శాసన సభ్యుడు పోచంరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి విమర్శించారు. మంగళవారం కడప నగరంలోని రవీంద్రనాథ్ రెడ్డి స్వగృహంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కమలాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు సాయినాథ్‌శర్మపై కమలాపురం పోలీసులు వేధింపులకు దిగుతున్నారని చెప్పారు. సాయినాథ్‌శర్మతోపాటు ఆయన కుమారుడు, అనుచరులపై హత్యాయత్నం, కిడ్నాప్ తదితర కేసులు పాత తేదీలతో నమోదు చేశారన్నారు. అధికార పార్టీ నాయకులను సంతృప్తి పరచడానికి పోలీసులు శ్రమిస్తున్న తీరు ప్రజలను విస్మయపరుస్తోందన్నారు. తెలుగుదేశం పార్టీకి విధేయులుగా పనిచేస్తున్న అధికారులపై కోర్టును ఆశ్రయించి వారికి తగిన గుణపాఠం చెబుతామన్నారు.

న్యాయమైన సమస్యలను పరిష్కరించాలి



పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : తమ న్యాయమైన సమస్యలు సత్వరమే పరిష్కరించేలా చూడాలని ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కడపలోని పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం ఎదుట వైఎస్సార్, కర్నూలు, అనంతపురం, చిత్తూరు ప్రాంతాలకు చెందిన రిటైర్డ్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పట్ల నిర్లక్ష్యాన్ని వీడి సమస్యల పరిష్కారం వైపు అడుగులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వైసీఎస్ రెడ్డి, నాగయ్య, జేఎంఆర్ నాయుడు, శేషాద్రి, శ్రీనివాసులు, వై.రాజారెడ్డి, ఎంవీ నారాయణ, బీసీ సుబ్బారెడ్డి, రవీంద్రనాథ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచానికి జ్ఞాన భిక్ష పెట్టిన దేశం మనది

కడప కల్చరల్ : ప్రపంచం నాగరికత నేర్వనప్పుడు మన దేశంలో విశ్వవిద్యాలయాలు ఉండినట్లు తెలుస్తోందని, ప్రపంచానికి మన దేశం జ్ఞాన భిక్ష పెట్టినట్లు పెద్దలు చెబుతున్నారని భారత జాతీయ కళాసాంస్కృతిక వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి అన్నారు. ఇంటాక్ కేంద్ర కార్యాలయం సూచన మేరకు మంగళవారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఇంటాక్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రపంచ వారసత్వ అంశాలపై క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ పోటీని ఆయన ప్రారంభించి ఆయన మాట్లాడారు. మన జాతీయ సంపదను వారసత్వ సంపదగా భావించాలని, అందుకే వాటి గురించిన ప్రాథమిక పరిజ్ఞానం అందించేందుకు, అవగాహన కల్పించేందుకు ఈ పోటీ నిర్వహిస్తున్నామన్నారు. క్యాంపు చైర్మన్లు బోగాల కొండారెడ్డి, రాఘవేంద్రవర్మ మాట్లాడుతూ గత సంవత్సరం మన జిల్లా విద్యార్థులు ఇలాంటి పోటీలో రీజినల్ స్థాయికి వెళ్లారని, ఈ పోటీ ద్వారా జాతీయ స్థాయికి వెళ్లాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో అతిథులు

ఈ పోటీలో తొలుత రాత పరీక్ష, అనంతరం మౌఖిక పరీక్ష నిర్వహించారు. ఇందులో బాల వికాస్ పాఠశాలకు చెందిన టి.ప్రదీప్‌కుమార్, జీవై బృందా ప్రథమ స్థానంలో నిలువగా, శాంతినికేతన్‌కు చెందిన నఫీసా, శ్వేతలు ద్వితీయ స్థానం, బాల వికాస్‌కే చెందిన మరో బృందం సభ్యులు ఇ.లాస్య, కె.సుభాష్ మూడవ స్థానంలో నిలిచారు. తొలి స్థానంలో నిలిచిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటారని సంస్థ కో కన్వీనర్ వీవీ సుబ్బారెడ్డి తెలిపారు. సభ్యులు బోగాల హేమంత్, ఆర్వీ మహేశ్వరి, పి.సంజీవరెడ్డి, మంజులమ్మ, పార్వతి, బాల యల్లారెడ్డి, వెల్లాల వెంకటేశ్వరాచారి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష

కడప అర్బన్ : చెన్నూరు పోలీస్ స్టేషన్ పరిధిలో రెండున్నర సంవత్సరాల క్రితం జరిగిన మహిళ హత్య కేసులో నిందితుడు బోయ నాగరాజు (36)కు యావజ్జీవ కారాగార శిక్ష, రూ. 1000 జరిమాన విధిస్తూ కడప ఫ్యామిలీ కోర్టు, 6వ ఏడీజే కోర్టు మెజిస్ట్రేట్ షేక్ ఇంతియాజ్ అహమ్మద్ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రస్తుత చెన్నూరు సీఐ పురుషోత్తం రాజు కేసు వివరాలను తెలియజేశారు. చెన్నూరు మండలం కొండపేటకు చెందిన హతురాలు కుసుమజ్యోతి (26)కి నిందితుడు బోయ నాగరాజుతో గతంలో పరిచయం ఉండటంతో సన్నిహితంగా వుండేవారు. ఈ విషయంపై హతురాలి భర్త, తల్లి ఆమెను మందలించారు. దీంతో కొండపేటకు వచ్చి నివాసం ఉండేది. తన దగ్గరకు నాగరాజును వచ్చి వెళ్లమని చెప్పేది. ఈ క్రమంలోనే తనతో పాటే ఉండిపోవాలని నాగరాజును, జ్యోతి నిలదీసింది. 2022 ఫిబ్రవరి 17న జ్యోతిని గొంతునులిమి హత్య చేసి ఇంటిలోని బీరువాలో ఉన్న రూ. 5500, జత కమ్మలు, బంగారు గిన్నె బొట్టును దొంగిలించుకుని వెళ్లి పోయాడు. ఈ నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడికి యావజ్జీవ శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ ప్రతాప్‌కుమార్ రెడ్డి వాదనలు వినిపించారు. అప్పటి చెన్నూరు సీఐ మహమ్మద్ అలీ, ప్రస్తుత సీఐ పురుషోత్తం రాజును జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ప్రత్యేకంగా అభినందించారు.

ఇన్‌స్పైర్ మనక్‌కు స్టూడెంట్స్‌ను ఇన్‌స్పైర్ చేయండి

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా త్వరలో జరగనున్న ఇన్‌స్పైర్ మనక్‌కు పిల్లలను ఇన్‌స్పైర్ చేయాలని డీఈఓ మర్రెడ్డి అనురాధ సూచించారు. మంగళవారం డీఈఓ కార్యాలయంలో జిల్లా సైన్సు అధికారి ఎబినైజర్ ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్ మనక్‌కు సంబంధించిన పోస్టర్లను డీఈఓ మర్రెడ్డి అనురాధ, డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డిలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇన్‌స్పైర్ మనక్‌కు ప్రతి ఉన్నత పాఠశాల నుంచి 5 నామినేషన్లు, ప్రతి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 3 నామినేషన్లు కచ్చితంగా దరఖాస్తు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి చల్లా విశ్వనాథరెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా, డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్, సిబ్బంది పాల్గొన్నారు.



ఇన్‌స్పైర్ మనక్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీఈఓ మర్రెడ్డి అనురాధ, డిప్యూటీ డీఈఓ

ఉద్యోగం ఇప్పిస్తానని టోకరా

ప్రొద్దుటూరు క్రైం : ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బు తీసుకొని భానుప్రకాష్‌రెడ్డి అనే వ్యక్తి మోసం చేసినట్లు మహబూబ్‌బాషా రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపేట గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా కుమారుడు మస్తాన్‌వలికి ఏపీఎస్పీడీసీఎల్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న భానుప్రకాష్‌రెడ్డి అనే వ్యక్తి పలు మార్లు ఫోన్‌పే ద్వారా వారి వద్ద నుంచి రెండేళ్ల క్రితం రూ.2.47 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం అడిగితే విజయవాడ, తిరుపతికి రావాలని చెప్పడంతో మూడు సార్లు అక్కడికి వెళ్లొచ్చారు. ఇలా ఉద్యోగం ఇప్పిస్తానని కాలయాపన చేస్తూ వస్తున్నాడు. డబ్బు తిరిగి ఇవ్వాలని అడిగితే అతను ఇవ్వలేదు. దీంతో మహబూబ్‌బాషా మంగళవారం పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ మహ్మద్‌రఫి తెలిపారు.

అంతిమ యాత్రలో అపశ్రుతి

- టపాసులతో కాలిన టమాటా క్రేట్లు
- దెబ్బతిన్న మరో రైతు భవనం
- రూ.5 లక్షలు నష్టం



అంగళ్లు టమాటా మండీల వద్ద క్రేట్లు కాలడంతో ఎగిసి పడుతున్న మంటలు

కురబలకోట : అంతిమ సంస్కారంలో భాగంగా పేల్చిన టపాసులు ఆ మార్గంలో పక్కనే ఉన్న టమాటా క్రేట్లపై పడటంతో అవి అంటుకుని కాలిపోయాయి. క్రేట్లను ఆనుకునే ఉన్న మరో రైతు భవనం ఎగిసిపడిన మంటలకు దెబ్బతింది. ఈ సంఘటనలో రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు భావిస్తున్నారు. స్థానికుల కథనం మేరకు..కురబలకోట మండలం అంగళ్లు గ్రామం మలిపెద్దివారిపల్లెకు చెందిన చిటికి తిప్పారెడ్డి రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఇతని అంత్యక్రియలు మంగళవారం ఉదయం నిర్వహించారు. ఆఖరి మజిలీ కావడంతో అంతిమ యాత్రను ఘనంగా ముగించాలన్న ఉద్దేశంతో పూలు చల్లుతూ టపాసులు పేలుస్తూ ముందుకు సాగారు. ఆ మార్గంలో పక్కనే ఉన్న టమాటా మండీల వద్ద మదనపల్లెకు చెందిన టమాటాల వ్యాపారి పీఏకె (పి. అహ్మద్ ఖాన్) ముందు రోజు రాత్రి లారీ లోడు టమాటా క్రేట్లు తోలాడు. పేలిన టపాసులు పక్కనే ఉన్న టమాటా క్రేట్లపై నిప్పురవ్వలు పడి అంటుకున్నాయి. ప్లాస్టిక్‌వి కావడంతో మంటలు ఎగిసి పడ్డాయి. మంటలకు అంగళ్లు, పరిసర ప్రాంతాల వారు కలవరపడ్డారు. అనంతరం మదనపల్లె ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే క్రేట్లన్నీ కాలిపోయాయి. రూ. 3 లక్షలకుపైగా నష్టం వాటిల్లినట్లు బాధితులు చెబుతున్నారు. క్రేట్లు కాలడంతో వీటిని ఆనుకుని ఉన్న చిటికి హరినాథరెడ్డికి చెందిన భవనం కూడా నల్లగా మారిపోయింది. ప్లాస్టింగ్, కిటికీలు, గోడలు దెబ్బతిన్నాయి. ఇతని భవనానికి కూడా రూ.2 లక్షలకు పైగా నష్టం సంభవించి ఉంటుందని భావిస్తున్నారు. ఊహించని పరిణామం పట్ల విచారం వ్యక్తమవుతోంది.

కార్ డేకార్స్‌లో అగ్నిప్రమాదం

రాజంపేట రూరల్ : జాతీయ రహదారిపై ఉస్మాన్ నగర్ వద్ద ఉన్న వీఆర్ డేకార్స్‌లో మంగళవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. యజమాని టి.వెంకటరమణ మధ్యాహ్నం సమయంలో షాపునకు షట్టర్ వేసి వెళ్లాడు. షాపులో నుంచి పొగలు రావడంతో పక్కనున్న షాపుల వారు యజమానికి సమాచారం ఇచ్చారు. ఆయన అగ్నిమాపక అధికారులకు ఫిర్యాదు చేశారు. తక్షణమే ఫైర్ అధికారి కె. సుభాన్ తన సిబ్బందితో వెళ్లి మంటలను అదుపులోకి తెచ్చారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన ఈ అగ్ని ప్రమాదం సంభవించినట్లు యజమాని వెంకటరమణ తెలిపారు. తన షాపులో ఉన్న రూ.10లక్షల విలువ చేసే సామగ్రి అగ్నికి ఆహుతి అయినట్లు తెలిపాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.



అగ్నికి ఆహుతి అయిన సామగ్రి

ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి

పెండ్లిమర్రి : మండలంలోని మల్లాయపల్లె గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిన సంఘటనలో మంగళవారం వండ్లవాండ్లపల్లె గ్రామానికి చెందిన అమీర్‌బాషా(36) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు అమీర్ బాషా పని నిమిత్తం కడపకు వెళ్లి పని ముగించుకొని తిరిగి ద్విచక్ర వాహనంలో ఇంటికి వస్తుండగా మల్లాయపల్లె గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతులకు పరిహారం

సాక్షి ఎఫెక్ట్..

ఖాజీపేట : విత్తన వడ్లకు రెక్కలు.. నాసిరకం విత్తనాలతో రైతులకు నష్టం అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన వార్తపై వ్యవసాయ అధికారులు స్పందించారు. కొక్కరాయపల్లె గ్రామంలోని రైతు నాగయ్య పొలం వద్దకు అధికారులు వెళ్లి పరిశీలించారు. రైతు పొలంలో వేసిన విత్తనాలు మొలక శాతం లేకపోవడంతో ఆ రైతుకు సదరు విత్తన వ్యాపారి నుంచి రూ.3వేల పరిహారం ఇప్పించారు. అలాగే పంట దెబ్బతిన్న రైతులకు విత్తనాలకు బదులు విత్తనాలను తిరిగి రైతులకు అందించారు.

కుందూలో గుర్తు తెలియని మృతదేహం

పెద్దముడియం : నెమళ్లదిన్నె గ్రామం వద్ద కుందూ నదిపై ఉన్న వంతెన వద్దకు గుర్తు తెలియని మృతదేహం కొట్టుకువచ్చినట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు. కుందూ నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఎగువ నుంచి 30 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల పురుషుని మృతదేహం కొట్టుకువచ్చిందన్నారు. మృతదేహం కుళ్లిపోయి గుర్తుపట్టలేనంత స్థితిలో ఉందన్నారు.

జిల్లా అదనపు ఎస్పీలకు ఘనంగా సన్మానం



అదనపు ఎస్పీలను సన్మానిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు, అధికారులు

కడప అర్బన్ : వైఎస్ఆర్ జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) లోసారి సుధాకర్, ఎస్ఈబీ అదనపు ఎస్పీ జి. వెంకటరాముడులను మంగళవారం రాత్రి కడపలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్‌రాజుతో పాటు, పోలీసు అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీలలో అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్‌ను ఏసీబీకి, ఎస్ఈబీ జి. వెంకటరాముడును హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ చేశారు. ఈ క్రమంలో వారిని ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు.

పాము కాటుతో చిన్నారి మృతి





మృతి చెందిన చిన్నారి, కాటేసిన పాము

ములకలచెరువు : పాముకాటుతో ఐదేళ్ల చిన్నారి మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. మండలంలోని దేవల చెరువు పంచాయతీ రాజుగారిపల్లికి చెందిన సింగారెడ్డి కుమార్తె సోనిక(5) ఇంటి ఆవరణంలో ఆడుకుంటుండగా పాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మదనపల్లి హాస్పిటల్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామాపురం : కర్నూలు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రామాపురం మండలం సరస్వతీపల్లెకు చెందిన లారీ డ్రైవర్ పెంచలయ్య (28) మృతి చెందాడు. బంధువుల వివరాల మేరకు .. మండల పరిధిలోని సరస్వతిపల్లెకు చెందిన చెన్నూరు పెంచలయ్య అనే వ్యక్తి సిలిండర్ ఏజెన్సీలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సిలిండర్ల లారీ లోడుతో కర్నూలు జిల్లా డోన్‌కు వెళుతుండగా ఆగివున్న లారీని ఢీకొన్నాడు. దీంతో పెంచలయ్య అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మంగళవారం పెంచలయ్య మృత దేహాన్ని రామాపురం మండలంలోని మృతుని స్వగ్రామానికి తీసుకువచ్చారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

మదనపల్లె : బైక్ అదుపుతప్పి వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. బి.కొత్తకోట ఇందిరమ్మ కాలనీకి చెందిన నాగప్ప కుమారుడు అంజలి కుమార్ (30) ట్రక్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం చెన్నువారిపల్లెలో అవ్వ మృతి చెందగా, ఆమె అంత్యక్రియలకు హాజరయ్యేందుకు బి.కొత్తకోట నుంచి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. మార్గమధ్యంలోని రంగసముద్రం రోడ్‌లో ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి బైక్ అదుపుతప్పి అంజలి కుమార్ కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అరటికాయల వాహనం బోల్తా

రాజంపేట : రాజంపేట పాతబస్టాండ్ సర్కిల్‌లో అరటి కాయల లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం మంగళవారం మధ్యాహ్నం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో వాహనంలో ఉన్న అరటికాయలు నేలపాలు కాగా కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వాహనం బోల్తాపడినప్పుడు జనసంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని క్రేన్ సహాయంతో వాహనాన్ని రోడ్డుపక్కకు తీయించి వాహనాల రాకపోకలు పునరుద్ధరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ సూరప్పగారిపల్లె వద్ద మూడు రోజుల క్రితం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటనలో మహిళ మృతి చెందినట్లు ఎస్ఐ మధు రామచంద్రుడు తెలిపారు. చిన్నమండెం మండలం దేవపట్లకు చెందిన కె.శంకర(45), కె. సాలమ్మ(39)లు గుర్రంకొండ పంచాయతీ సుంకరవాండ్లపల్లెలోని తమ బంధువుల ఇంటికి ఈనెల 17 సాయంత్రం వచ్చారు. ఈనెల18న సుంకరవాండ్లపల్లెనుంచి తిరిగి తమ స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై బయలు దేరారు. మార్గమధ్యంలో సూరప్పగారిపల్లె మిట్ట వద్దకు చేరుకోగానే రాయచోటి వైపు వెళుతున్న ఓ గుర్తుతెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో దంపతులిద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితుల్ని చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. మూడు రోజులుగా మదనపల్లె ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాలమ్మ మంగళవారం మృతి చెందింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి వారి బంధువులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు వాహనాలు ఢీ

– వ్యక్తికి తీవ్ర గాయాలు

పుల్లంపేట : కడప – చెన్నై జాతీయ రహదారి ఏపీ ఆదర్శ పాఠశాల వద్ద మంగళవారం ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ అశోక్ కాలు నుజ్జు నుజ్జు అయింది. విషయం తెలుసుకున్న పుల్లంపేట ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయపడిన అశోక్‌ను 108 వాహనం ద్వారా రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జేఎంజే కళాశాల వద్ద రెండు వాహనాలు ఢీ

సిద్దవటం : మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలోని జేఎంజే కళాశాల వద్ద మంగళవారం తెల్లవారు జామున కారు– సిమెంటు లారీ ఢీకొన్నాయి. తిరుపతి నుంచి హైదరాబాదుకు వెళుతున్న కారును జేఎంజే కళాశాల సమీపంలో ఎర్రగుంట్ల నుంచి తిరుపతి వైపు వెళుతున్న సిమెంటు లారీ ఢీకొంది. ప్రమాదంలో కారులో ఉన్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న స్కూల్ వ్యాన్

– త్రుటిలో తప్పిన ప్రమాదం

పుల్లంపేట : నారాయణ స్కూల్ వ్యాన్ మండల పరిధిలోని కొమ్మనవారిపల్లి సమీపాన విద్యుత్ స్తంభాన్ని ఢీ కొనడంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. వివరాలిలా.. రాజంపేట నుంచి నారాయణ స్కూల్ విద్యార్థులను ప్రతిరోజూ పాఠశాలకు తీసుకెళ్తారు. మంగళవారం కొమ్మనవారిపల్లి వద్ద ఉన్న విద్యుత్ స్తంభాన్ని వ్యాన్ ఢీ కొనడంతో పెను ప్రమాదం తప్పింది.